
సాక్షి నిజామాబాద్
మంగళవారం । 26 । నవంబర్ । 2024



కళాశాలకు కొత్త సొబగులు
మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు అదనపు గదుల నిర్మాణం, విద్యా సామగ్రికి పీఎం ఉషా పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయి.
- 8లో ▸



మరమ్మతులు చేసేదెన్నడో?
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువ మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /10.7

వాతావరణం
ఉదయం మంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రజావాణికి 95 ఫిర్యాదులు



నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



నిజామాబాద్‌సిటీ : మహిళలు తమపై జరిగే హింసను ఎదిరించాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. 'మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ప్రతి మహిళా రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలన్నారు. హక్కులకు భంగం కలిగినప్పుడు, హింసనుంచి విముక్తి పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి రాజశ్రీ, మెప్మా పీఆర్‌పీ శోభ, మాధురి, ప్రాజెక్ట్ మేనేజర్ రాజేశ్, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఆపితే సహించేది లేదు



వేల్పూర్: సర్వేలో టీవీ, ఫ్రిడ్జ్, ద్విచక్రవాహనం వంటి సాధారణ అంశాలను పరిగణనలోకి తీసుకొని సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్‌లోని తన ఇంటికి వచ్చిన అధికారులకు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేను వ్యతిరేకిస్తూ మాట్లాడిన వీడియోను చూపించారు. అప్పుడు వ్యతిరేకించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎలా సర్వే చేపడుతున్నారని ప్రశ్నించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన గోప్యత హక్కులకు విరుద్ధంగా ఆస్తులు, అంతస్తులు, వాహనాలు, ఇతర స్థిరాస్తుల వివరాలను ఎలా సేకరిస్తారని అధికారులను ప్రశ్నించారు. నాటి సర్వేకు వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పిన తర్వాత వ్యక్తిగత వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలనే ఆతృతలో తప్పులు దొర్లే ప్రమాదం ఉందని, ప్రజలకు న్యాయం దక్కేలా వివరాలు నమోదు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కుటుంబ వివరాలను సర్వే అధికారులకు తెలిపారు.

డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే

కామారెడ్డి టౌన్: జిల్లావ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు డిసెంబర్ 4న జాతీయ సాధన సర్వే నిర్వహించనున్నట్లు కామారెడ్డి డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేలో పాల్గొనడానికి జిల్లా వ్యాప్తంగా 150 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా బీఈడీ, పీజీ చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేశామని పేర్కొన్నారు. వారికి ఈ నెల 26, 27, 28 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే 92 మంది పరిశీలకులను నియమించి వారికి 3 సార్లు మాక్ టెస్ట్ చేపట్టామన్నారు. జిల్లాలోని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులందరూ విద్యా ర్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆదేశించారు.

కేబినెట్ బెర్త్ కోసం..

మాజీ మంత్రి, సీనియర్ నేత ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో బెర్త్ ఆదిలోనే ఖాయమైంది. అయితే కాంగ్రెస్ అధినాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం ఏడాదిగా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పాలనపై, వివిధ శాఖల్లో చోటుచేసుకుంటున్న వ్యవహారాలపై అంతగా ఫోకస్ పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.



- సుదర్శన్‌రెడ్డికే పదవి ఖాయమైనా అధిష్టానం నిర్ణయంలో ఆలస్యం
- ఇన్‌చార్జి మంత్రి జిల్లాపై ఫోకస్ పెట్టకపోవడంతో పడకేసిన పాలన
- మరోవైపు నామినేటెడ్ పదవుల కోసం నాయకుల ఎదురుచూపులు
- ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనప్పటికీ ఆలస్యం చేయడంపై కినుక

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచింది. జిల్లా నుంచి పదవుల కోసం పలువురు నాయకులు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన మంత్రి పదవి జిల్లా నుంచి లేకపోవడంతో పాలన పట్టు తప్పింది. విద్య, వైద్య శాఖలతో పాటు జిల్లా పంచాయతీ, సంక్షేమ శాఖలు, రిజిస్ట్రేషన్ల శాఖ, రెవెన్యూ శాఖ, గనుల శాఖ, పౌరసరఫరాల శాఖలో అనేక అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పాలనపై, వివిధ శాఖల్లో చోటుచేసుకుంటున్న వ్యవహారాలపై అంతగా ఫోకస్ చేయడం లేదు. పాలనపై సమీక్షలు చేసేందుకు సైతం మంత్రి జూపల్లి అంతగా శ్రద్ధ చూపడం లేదు. జూపల్లి జిల్లాకు వచ్చేది కూడా అంతంతమాత్రమే అయింది. దీంతో జిల్లా యంత్రాంగం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే అంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో బోధన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఆదిలోనే ఖాయమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చేందుకు నిర్ణయించారు. కాంగ్రెస్ అధినాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ నుంచి నలుగురు ఎమ్మెల్యేలు గెలవగా, ఇందులో మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలు మొదటిసారి ఎన్నికైనవారే. దీంతో సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వడమనేది అనివార్యం. అనుభవం, సీనియారిటీ దృష్ట్యా చూసినప్పటికీ సుదర్శన్‌రెడ్డికే బెర్త్ కేటాయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణ కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే కాకుండా, సాధారణ ప్రజలు సైతం ఎదురు చూడాల్సి వస్తోంది. సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే జిల్లా యంత్రాంగం పనితీరుపై నిరంతరం దృష్టి పెట్టి తగిన విధంగా చర్యలు తీసుకుంటూ ముందుకు వెళ్లొచ్చని ప్రజలు అంటున్నారు. అయితే కేబినెట్ విస్తరణ విషయంలో ఏడాది కాలంగా అదుగో ఇదుగో అంటూ కాలం గడుపుతుండడంతో జిల్లాలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు అంటున్నారు.

మరోవైపు నామినేటెడ్ పదవులు ఆశించే నాయకుల సంఖ్య కూడా బాగానే ఉంది. ఆది నుంచి పార్టీలో ఉంటూ గత పదేళ్లలో అనేక ఇబ్బందులు పడుతూ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులు, కార్యకర్తలు తమకు తగిన నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక పార్టీలు మారి ఇతర పార్టీల్లోకి వెళ్లి వచ్చిన నాయకులు సైతం తమకు పదవులు కావాలని అడుగుతుండడంతో పార్టీ మారకుండా, గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, సీనియర్ నేత బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్ష పదవి దక్కించుకున్నారు. ఈ క్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి, ఇతర పార్టీ పదవులు ఆశించే వారు సైతం పార్టీ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి

- ఫ్యాక్టరీని తెరిపించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- చెరుకు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలి
- శాస్త్రవేత్తలు సూచించే నూతన చెరుకు వంగడాలతో అధిక దిగుబడి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్ : నిజాం షుగర్స్ పునరుద్ధరణకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. చెరుకు సాగుపై అవగాహన కల్పించేందుకు చెరుకు పరిశోధన కేంద్రం (రుద్రూర్) శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సుదర్శన్‌రెడ్డి రైతులతో సోమవారం సాలూరలోని రైతు వేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నడిచే చెరుకు ఫ్యాక్టరీ మూతపడటంతో బోధన్, జహీరాబాద్, మెదక్ ప్రాంతాల రైతులు చెరుకు సాగుకు దూరమయ్యారన్నారు. ఎన్నికల హామీ మేరకు నిజాంషుగర్స్‌ను తెరిపించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. రైతులు చెరుకు సాగు చేసేందుకు ముందుకురావాలని ఆయన కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు నూతన చెరుకు వంగడాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు ఎల్లప్పుడూ వరిని మాత్రమే సాగు చేయకుండా పంట మార్పిడి అలవర్చుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని అన్నారు. తీగజాతి కూరగాయ పంటలు సాగు చేసే రైతులకు పందిళ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. సన్న ధాన్యం సాగుచేసిన రైతుల ఖాతాల్లో రూ.500 చొప్పున బోనస్ జమ చేశామని, త్వరలో అర్హులందరికీ రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం అందిస్తామన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ సమస్యలపై సమీక్ష



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ధరణి సమస్యలపై సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్ మకరంద్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణిలో చేపడుతున్న రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణిలో సాంకేతిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ధరణిలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగారు. స్లాట్ బుకింగ్ సమయంలో ఏవైన సందేహాలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ధరణిలో కొత్త మాడ్యుల్స్ రైతులకు ఎలా ఉపయోగపడుతున్నాయని చర్చించారు. ధరణి సమస్యలపై అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ కిరణ్మయి, డిప్యూటీ తహసీల్దార్ దత్తాద్రి, ఆర్‌ఐ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌సీఎస్‌ఎఫ్‌ను బెల్లం ఫ్యాక్టరీగా మార్చాలి



గడుగుకు వినతిపత్రం అందజేస్తున్న రైతునాయకులు

నిజామాబాద్ రూరల్ : సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని బెల్లం ఫ్యాక్టరీగా మార్చి నడపాలని ఎన్సీఎస్ఎఫ్ చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్‌ను కోరారు. రైతులు సోమవారం గడుగును నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార చక్కెర ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం 1964 చట్టం ప్రకారం నడపాలని, రైతులు చెరుకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వరితో పోలిస్తే చెరుకు సాగు రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. సహకార చక్కెర సంఘం సభ్యులుగా 23వేల మంది ఉన్నప్పటికీ 6వేల మంది రైతులు రెగ్యులర్‌గా చెరుకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 6వేల మంది వ్యవసాయ కూలీలకు, ఫ్యాక్టరీలో 500 మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని కొందరు రాజకీయ నాయకులు అమ్ముకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు పూర్తి సహాయసహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందించే విధంగా కృషి చేయాలని గడుగుకు విజ్ఞప్తి చేశారు. గడుగును కలిసిన వారిలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం నాయకులు బొడ్డు గంగారెడ్డి, ఆకుల పాపయ్య, బి.లక్ష్మణ్‌రెడ్డి, సాయిరెడ్డి, కృష్ణాగౌడ్, నగేశ్ తదితరులున్నారు.

నియామకాలెన్నడో?

- వైద్యారోగ్యశాఖలో భర్తీకాని అవుట్‌సోర్సింగ్ పోస్టులు
- పదుల సంఖ్యలో పోస్టులు.. వందల సంఖ్యలో దరఖాస్తులు
- దరఖాస్తులు స్వీకరించి తొమ్మిది నెలలు..
- నాటి నుంచి ఎదురుచూపులే



హోదా	పోస్టులు	దరఖాస్తులు
స్టాఫ్‌నర్సు	30	894
ఏఎన్‌ఎం	03	447
డాటాఎంట్రీఆపరేటర్, అకౌంటెంట్	01	152
ఫార్మాసిస్ట్	06	400
డాటా ఎంట్రీ ఆపరేటర్	03	172
ఆర్‌బీఎస్‌కే మెడికల్‌ఆఫీసర్	11	11
జిల్లా కో ఆర్డినేటర్	01	25
న్యూట్రీషన్	01	50

నిజామాబాద్‌నాగారం : వైద్యారోగ్యశాఖలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తొమ్మిది నెలలుగా నిరీక్షిస్తున్నారు. దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వైద్యారోగ్యశాఖలో స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, డాటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, ఆర్‌బీఎస్‌కే, ఫార్మాసిస్ట్, కో ఆర్డినేటర్, న్యూట్రిషన్ తదితర పోస్టులను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తులు భారీ సంఖ్యలో రావడంతో అప్పటి డీఎంహెచ్‌వో సుదర్శనం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరుతో కాలయాపన చేశారనే విమర్శలున్నాయి. మెరిట్ జాబితాను నెల రోజుల్లో తయారు చేస్తామని చెప్పారని, తొమ్మిది నెలలవుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఆయన పదవీ విరమణ చేయడం, పార్లమెంట్ ఎన్నికల కోడ్, మూడు నెలలపాటు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కొనసాగడం జాప్యానికి కారణమైంది. ఆగస్టులో పూర్తిస్థాయి డీఎంహెచ్‌వోగా రాజశ్రీ వచ్చినప్పటికీ ఆమెకు పూర్తిస్థాయి అవగాహన రావడానికి రెండు నెలల సమయం పట్టింది. ఆ వెంటనే శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకం అటకెక్కింది.

ఆశలన్నీ డీఎంహెచ్‌వోపైనే..

పోస్టులు పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ వందల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే గతంలో పని చేసిన శాఖ జిల్లా అధికారులు అవుట్ సోర్సింగ్ నియామకాలను పట్టించుకోలేదని, ఇప్పుడు తమ ఆశలన్నీ ప్రస్తుత డీఎంహెచ్‌వోపైనే ఉన్నాయని దరఖాస్తుదారులు అంటున్నారు. మెరిట్ జాబితా ఎప్పుడు విడుదల చేస్తారని ఆశతో ప్రతిరోజూ కార్యాలయానికి వస్తున్నారు. కొందరు దరఖాస్తుదారులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నెల చివరివరకు భర్తీ చేస్తాం



ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, నేను బాధ్యతలు తీసుకున్న తరువాత బదిలీల ప్రక్రియ చేపట్టంతో అవుట్‌సోర్సింగ్ నియామకాలు ఆలస్యమయ్యాయి. స్వయంగా దరఖాస్తులను పరిశీలించి మెరిట్ జాబితాను రూపొందిస్తున్నా. ఈ నెలాఖరు నాటికి కచ్చితంగా పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటా.

– రాజశ్రీ, డీఎంహెచ్‌వో

మహాలక్ష్మి ఎదురుచూపు


- అందని రూ.2,500 ఆర్థికసాయం
- ఏడాదైనా ముందుకు పడని అడుగులు
- నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించినా ఫలితం శూన్యం



మోర్తాడ్(బాల్కొండ): బీడీ కార్మికురాలైన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మికి ఆసరా పథకం కింద జీవన భృతి అందలేదు. అప్పటి ప్రభుత్వం బీడీ కార్మికుల పింఛన్‌కు కటాఫ్ నిబంధనలను పెట్టి మళ్లీ ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఇలా రాజ్యలక్ష్మితోపాటు మరెందరో మహిళలకు ఏ విధమైన పింఛనూ అందడం లేదు. అలాంటి గృహిణులందరికీ ప్రతినెలా మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగానే మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన నాయకులు మొదటి నుంచి చెబుతున్నారు. ఆరు గ్యారెంటీల హామీల అమలు కోసం 2024–25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.53,196 కోట్లు కేటాయించింది. అయినప్పటికీ ఏడాది గడిచిపోయే పరిస్థితి ఉన్నా మహాలక్ష్మి సాయంపై స్పందన కరువైంది. 'మహాలక్ష్మి' సాయం కోసం 3,55,347 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేయాల్సి ఉంది. దరఖాస్తుదారుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. ఇప్పటికే జిల్లాలో 77,158 మంది వితంతులు, 10,520 మంది ఒంటరి మహిళలు, 96,264 మంది బీడీ కార్మికులకు పింఛన్‌లు అందుతున్నాయి. ఆసరా పథకం కింద లబ్ధి పొందుతున్నవారికి మహాలక్ష్మి సాయం అందించే అవకాశం లేదు. మహాలక్ష్మి పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తే జిల్లాలో సుమారు 40వేల మంది లబ్ధిపొందే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే ప్రతి నెలా సాయం అందుకునేవారి విషయంలో స్పష్టత రానుంది. ప్రభుత్వం ఎప్పుడు ప్రకటన చేస్తుందోనని మహిళలు నిరీక్షిస్తున్నారు.

మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని, దరఖాస్తులు అందించగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంచామని మోర్తాడ్ ఎంపీడీవో తిరుమల తెలిపారు.

చెక్కు చెదరని ఇనుప వంతెన



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువపై మెండోరా మండల కేంద్రం శివారులో నిర్మించిన ఇనుప వంతెన ఇప్పటికీ చెక్కు చెదర లేదు. కాలువ నిర్మాణ కాలంలోనే కాలి నడకన కాలువను దాటేందుకు ఇనుప వంతెన నిర్మించారు. నాటి నుంచి నీటిలో తడుస్తున్నా ఇప్పటికీ ఇనుప వంతెన చెక్కు చెదరకపోవడం నాటి పనుల్లో నాణ్యతకు అద్దంపడుతోంది. ఆ ఇనుప వంతెన చూపరులను ఆకట్టుకుంటోంది.

– బాల్కొండ

బిడ్డ అనారోగ్యం తట్టుకోలేక..

- 18 నెలల చిన్నారితో చెరువులో దూకి తండ్రి బలవన్మరణం
- కుటుంబ సభ్యులు క్షమించాలంటూ సూసైడ్ నోట్



నేహశ్రీ (ఎడమ), చిన్న కూతురితో కలిసి క్రాంతికుమార్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : ఒక వైపు 18 నెలల కుమార్తెకు తీవ్ర అనారోగ్య సమస్య.. మరోవైపు ఆర్థిక భారం.. వెరసి తీవ్ర మానసిక క్షోభతో మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ మాసాని చెరువులో కూతురుతో సహా దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు తండ్రి. వెళ్లిపోతున్నా.. క్షమించాలంటూ భార్య మానస, కుటుంబ సభ్యులకు సూసైడ్ నోట్ రాసి తనువు చాలించాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన రఘుపతి క్రాంతికుమార్ (35) కు జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన మానసతో వివాహమైంది. వీరికి 18 నెలల నేహశ్రీ , 3 నెలల వయస్సుగల మరో పాప ఉంది. నేహశ్రీ అంటే తండ్రికి ఎనలేని ప్రేమ. క్రాంతికుమార్ డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి)లోని గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. నేహశ్రీకి మానసిక అనారోగ్యం కారణంగా రెండు సార్లు బ్రెయిన్ ఆపరేషన్ చేయించాడు. వైద్య ఖర్చులు పెరిగిపోయాయి. అయినప్పటికీ కూతురు ఆరోగ్యం మెరుగుపడలేదు. మరోవైపు అప్పులు తీర్చే మార్గం లేక క్రాంతికుమార్ నిత్యం మనస్తాపానికి గురయ్యేవాడు. క్రాంతికుమార్ తన జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఇంట్లో స్నేహితులతో జరుపుకున్నాడు. రోజంతా సంతోషంగా గడిపిన ఆయన పెద్ద కుమార్తెతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో నేహ శ్రీని వెంట బెట్టుకుని బైక్‌పై మాసాని చెరువు కట్టకు చేరుకుని కూతురితో కలిసి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

చెరువు కట్టపై బైక్‌ను నిలిపి..

సోమవారం ఉదయం భర్త క్రాంతికుమార్, పెద్ద కుమార్తె నేహ శ్రీ కన్పించకపోవడంతో మానస ఆందోళనకు గురైంది. వెంటనే తల్లిదండ్రులు, బంధువులకు సమాచారమివ్వగా, వారంతా గాలించారు. క్రాంతికుమార్ బైక్ మాసాని చెరువు కట్ట పై కన్పించడంతో పోలీసులకు సమాచారమిచ్చా రు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికి తీయించా రు. పోస్టుమార్టం తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. కేసు నమోదు చేసుకు ని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

క్రాంతికుమార్ సూసైడ్ నోట్‌లో సారీ అమ్మ, నాన్న, భార్య, చెల్లె, తమ్ముడు.. తాను వెళ్లిపోతున్నానని, భార్య మానస చిన్న కుమార్తెను మంచిగా చూసుకోవాలని, సంతోషంగా ఉండాలని రాసినట్లు పోలీ టసులు పేర్కొన్నారు. కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు కొత్త సొబగులు

- అదనపు గదుల నిర్మాణం, విద్యా సామగ్రికి రూ.5 కోట్లు మంజూరు
- పీఎం ఉషా పథకం కింద నిధులు మంజూరు చేసిన కేంద్రం

మోర్తాడ్: మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు కొత్త సొబగులు దిద్దుకుంటున్నాయి. అదనపు గదుల నిర్మాణం, విద్యా సామాగ్రికి ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్(పీఎం ఉషా) పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులు అందుకున్న ఏకైక కళాశాల మోర్తాడ్ కావడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మోర్తాడ్‌కు డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా తెలంగాణ ఆవిర్భవం తర్వాత నిర్మాణం పూర్తి చేసుకుంది. బీఏ, బీకాం కంప్యూటర్స్, జనరల్, బీఎస్సీ మ్యాథ్స్, బీజడ్‌సీ, కంప్యూటర్స్ కోర్సుల్లో విద్యార్థులకు ఉన్నత విద్య అందుతోంది. ఇంగ్లీష్, తెలుగు మీడియాల్లో బోధన సాగుతోంది. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, వేల్పూర్ మండలాల విద్యార్థులకు డిగ్రీ విద్యను అందిస్తున్న మోర్తాడ్‌లో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయవచ్చని అధికారులు భావించారు. ఇదిలా ఉండగా ఉన్నత విద్యామండలి చొరవతో ఉద్యోగ అర్హత పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్‌సీసీ కెడెట్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడానికి ఆర్మీ అధికారులు పరిశీలన చేపట్టారు. ఇప్పటికే ఎన్ఎస్ఎస్ క్యాంపులను నిర్వహిస్తూ విద్యార్థులను సమాజ సేవలో తరలించేలా అధ్యాపకుల బృందం కృషి చేస్తోంది. అదనపు గదుల నిర్మాణం, విద్యా సామాగ్రి కొనుగోలుతో విద్యార్థులకు మరిన్ని మెరుగైన విద్య సేవలు అందడానికి అవకాశం ఏర్పడనుంది. పీఎం ఉషా పథకం కింద మంజూరైన నిధులతో అదనపు గదులను ప్రస్తుతం ఉన్న భవనంపై నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అదనపు గదుల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు పీజీ సెంటర్ కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


మోర్తాడ్ డిగ్రీ కళాశాల భవనం


అదనపు గదుల నిర్మాణానికి జరుగుతున్న ఏర్పాట్లు

సృష్టికి మూలం మహిళలు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి


మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

ఖలీల్‌వాడి: సృష్టికి మూలం మహిళలు అని.. మహిళలు లేనిది సృష్టి లేదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి పద్మావతి, డీసీపీ బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళ హింస వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించబడుతున్న సఖి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ట్రైనీ కలెక్టర్ సాకేత్ కుమార్, డీసీపీ బస్వారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి హాజరై మాట్లాడారు. కుటుంబంలోని మహిళల మధ్య సఖ్యత, సమన్వయం ఉన్నప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తలేవని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో పెద్దలు మంచి, చెడు గురించి పిల్లలకు చెప్పకపోతే మహిళల సంరక్షణార్థం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా అవి వ్యర్థమే అని అన్నారు. సుమారు కొన్ని వేల గృహహింస కేసులు, వరకట్న వేధింపుల కేసులు నమోదు కావడం బాధకరమని జడ్జి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో జరిగే చిన్న పాటి గొడవలను చూసీచూడనట్లు వ్యవహరిస్తే కేసులు నమోదు కావన్నారు. అనంతరం చిన్నారులు, మహిళలు ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలు అందించే మహిళలను సన్మానించారు. వైద్య రంగంలో డాక్టర్ రోహిణి, న్యాయవాద వృత్తిలో వసంత కుమారి, టీచింగ్‌లో ఎస్ విమల, సమాజ సేవలో లక్ష్మీదేవి, క్రీడా రంగంలో శ్రీవాణి, పారిశ్రామిక రంగంలో లతను సన్మానించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సఖి అడ్మినిస్ట్రేషన్ భానుప్రియ, కౌన్సిలర్లు, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

మహిళా హ్యాండ్ బాల్ క్రీడాకారులకు శిక్షణ



ఆర్మూర్: పట్టణంలోని మినీస్టేడియంలో 46వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళా హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టుకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు గంగామోహన్ చక్రు సోమవారం తెలిపారు. ఈనెల 29 నుంచి డిసెంబర్ 1 వరకు ఆర్మూర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టుకు శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జిల్లా జట్టును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి సొడా సురేశ్, ప్రధానకార్యదర్శి పింజ సురేందర్, కోశాధికారి రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్, రమనణ, శ్యామ్, నరేందర్, సునీత, మాధురి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

- డీఐఈవో రవికుమార్



నిజామాబాద్‌నాగారం: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. మేరా యువభారత్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా సోమవారం సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన 14 బృందాలు పాల్గొన్నాయి. కార్యాక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో డివిజన్ స్థాయిలో కూడా మరిన్ని పోటీలు నిర్వహించి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన బృందాలకు బహుమతులు అందజేశారు. పోటీలలో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు, మేరా యువ భారత్ అందించిన నూతన డైరీలను అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్, పోటీల నిర్వాహకురాలు, జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్, కళాశాలల, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్పీ నిర్వాహకుడి చేతివాటం?

కోటగిరి: మండల కేంద్రంలో ఓ బ్యాంకుకు చెందిన కస్టమర్ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. సెంటర్‌కు వచ్చే ఖాతాదారులకు తెలియకుండా అదనంగా డబ్బులు డ్రా చేసి సీఎస్పీ నిర్వాహకుడు తన సొంతానికి వాడుకుంటున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా డ్రా చేయకుండానే ఖాతాలోని డబ్బులు తగ్గిపోవడం గుర్తించిన బాధితులు బ్యాంకులో ఆరా తీయగా సీఎస్పీ నిర్వాహకుని నిర్వాకంగా తెలిసింది. దీంతో సదరు వ్యక్తి ఖాతాదారులను బ్రతిమిలాడి త్వరలోనే డబ్బులు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించినట్లు తెలిసింది.

కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి పెద్దపీట

- నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్: వ్యవసాయరంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తోందని నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. సన్నరకాలకు బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం తాడెంలో రైతులతో కలిసి సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ, పింఛన్ల పెంపు, తదితర హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా.. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల అమలుకు కంకణబద్ధులై పని చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, నాయకులు సూర్యారెడ్డి, జలంధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజయ్‌రెడ్డి, పాష, సాయిరెడ్డి, సాయికుమార్, కెతావత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గంగారెడ్డి

28న కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ఈనెల 28న భూదేవీ ఇండోర్ స్టేడియంలో సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్స్ కబడ్డీ చాంపియన్ కోసం ఉమెన్స్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు నిజామబాద్ జిల్లా కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగయ్య, గంగాధర్ సోమవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. 75 కిలోల కంటే ఎక్కువ బరువు ఉండరాదని అన్నారు. ఎంపికైన జట్టు హైదరాబాద్‌లో వచ్చే నెల 7 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

సాహిత్యంలో వరలక్ష్మికి జాతీయ స్థాయి అవార్డు

నిజామాబాద్ అర్బన్: శ్రీ ఆర్యన్ సకల కళా వేదిక, శ్రీగౌతమేశ్వర సాహితీ సంస్థల ఆధ్వర్యంలో సంయుక్తంగా కరీంనగర్ జిల్లాలోని ఫిలిం భవన్‌లో విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఆదివారం జాతీయ స్థాయి చతుర్ముఖ సింహ అవార్డులను అందజేశారు. జిల్లాకు చెందిన డొంకేశ్వర్ మండలం, తొండాకూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ వరలక్ష్మి 500లకు పైగా కవితలు, 280పైగా చిత్రాలు, 20 పాటలు, 30 కథలు రాసి సాహిత్యంలో రాణిస్తున్నందున జాతీయస్థాయి చతుర్ముఖ సింహ అవార్డును ప్రధానం చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దూడపాక శ్రీధర్, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, పొర్ల వేణుగోపాల్ రావు కాసారం, లావణ్య, కవులు, కళాకారులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న వరలక్ష్మి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 10వ జిల్లా స్థాయి సబ్ జూనియర్ అండర్-8, 10, 12 బాలబాలికల ఎంపికలు స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించారు. ఐదువందలకు పైగా క్రీడాకారులు పాల్గొనగా అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, వెండి, కాంస్య పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 1న మంచిర్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన వారిలో ఎం సిద్దేశ్వర్, ఎ సాయిశ్రేష్ఠ, ఎం విరాట్, జె లక్ష్మణ్, కె కార్తికేయ, ఎస్‌కే జోయా, కె అఖిల, ఎం మనీష, ఎ భార్గవ్‌రెడ్డి, ఎస్ దేవదాస్, ఎం వరుణ్, ఎం రాణప్రతాప్, ఎ అనిల్, టి కృష్ణవేణి, ఎం స్నేహ, జి భాగ్యశ్రీ,, జి మధుప్రియ, కె శృతిక, కె సింధు, కె సాయిచిలిసియా రాథోడ్ ఉన్నారు. కార్యక్రమంలో పద్మపాణి సంస్థ డైరెక్టర్ స్వర్ణలత, మేనేజర్ అరుణిమ, ప్రతినిధులు ఆర్ వెంకటేశ్వరగౌడ్, అరుణ, సరిత, రేణుక, మహేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

నాట్య మయూరి అవార్డు అందుకున్న ప్రహర్షిణి

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి మంజునాథ నృత్య కళా నిలయం విద్యార్థిని తోకల ప్రహర్షిణి భరత నాట్యంలో నాట్య మయూరి అవార్డు అందుకుని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు ప్రహర్షిణికి నాట్య మయూరి అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. విద్యార్థినికి అవార్డు రావడంపై తల్లితండ్రులు తోకల భాను, మోహన్, నాట్య గురువు కవిత ఆనందం వ్యక్తం చేశారు.


ప్రశంసాపత్రంతో ప్రహర్షిణి

మొరం తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

రెంజల్: మండలంలోని నీలా చెరువులో మొరం తవ్వకాలను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. రెండు రోజులుగా చెరువులో మొరం తవ్వుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో తవ్వకాలను నిలిపివేసినట్లు తెలిపారు. టిప్పర్లు, జేసీబీలను నిలిపివేసి అధికారులు వచ్చే వరకు కదలనిచ్చేది లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ గబ్బర్‌సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ప్రభుత్వ పనులకు మొరం తవ్వకాలను అనుమతించినట్లు తహసీల్దార్ స్థానికులకు వివరించారు. అక్రమంగా పరిమితికి మించి తవ్వుతున్నారని స్థానికులు వివరించగా అక్కడ తవ్వకాలను నిలిపి వేయించి కందకుర్తికి తరలించారు. ప్రభుత్వం వ్యవసాయ రోడ్లకు నిధులు మంజూరు చేయడంతో మొరం పనులకు జిల్లా అధికారుల అనుమతి తీసుకున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.


మొరం తవ్వకాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య


శారద(ఫైల్)

ఎల్లారెడ్డి: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి తండాలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం ..తిమ్మారెడ్డి తండాకు చెందిన దరావత్ శారద(28) కొన్ని నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త దేవీసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

గూపన్‌పల్లిలో యువకుడు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన పవన్(24) అనే యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ పేర్కొన్నారు. స్థానికులు, ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. పవన్ బైపాస్ రోడ్డులో ఉన్న లహరి హోటల్‌లో పనిచేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్


నీలా చౌరస్తాలో తనిఖీలు చేపడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

రెంజల్: ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో ఇసుక అక్రమ కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనివారం అర్ధరాత్రి మండలంలోని నీలా, కందకుర్తి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. నిత్యం రెవెన్యూ, పోలీసు సిబ్బందితో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నట్లు పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కామారెడ్డి క్రైం: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారిని హత్య చేసి వారి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లడమే వారికి అలవాటు.. గతంలో వారు అనేక కేసుల విషయంలో జైలు జీవితాన్ని గడిపి బయటకి వచ్చినా వారి తీరు మాత్రం మారలేదు. ఈనెల 20న ఓ మహిళను హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కంచర్లలో చోటుచేసుకుంది. హత్యకు సంబంధించిన వివరాలను కామారెడ్డి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు వెల్లడించారు. భిక్కనూర్ మండలం కంచర్ల శివారులో ఈ నెల 20న మహిళ హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ భూమిలో పని చేస్తున్న సుగుణ తలపై దుండగులు కొట్టి హత్య చేసి, ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాన్ని దొంగిలించారు. ఈ కేసులో అల్లెపు మల్లయ్య అనే నిందితుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, నిందితులు నవీన్, ప్రసాద్, సాలవ్వలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నిందితులు బీబీపేట్ మండలం యాడారం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. నిందితుల నుంచి బంగారాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే విధంగా గతంలో నిందితులపై పలు కేసులు ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

న్యాయవాదిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు..

ఖలీల్‌వాడి: న్యాయవాదిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రెండోటౌన్ పీఎస్ పరిధిలోని ఖిల్లా ప్రాంతంలో న్యాయవాది ఖాసీంకు చెందిన షెటర్‌ను ముగ్గురు వ్యక్తులు తమకు విక్రయించాలంటు అదే ప్రాంతానికి చెందిన తండ్రి, కొడుకులు ముజఫర్ ఖాన్, హర్షద్‌ఖాన్‌తో పాటు మరొకరు దాడి చేశారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

బోధన్‌టౌన్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బోధన్‌పట్టణంలోని రవిగార్డెన్ సమీపంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ వెంకట్‌నారాయణ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం అమందాపూర్‌కు చెందిన సతీశ్‌గౌడ్(31) తన మిత్రుడితో కలిసి రవిగార్డెన్ రోడ్డు మీదుగా రాయకూర్‌కు వెళ్తుండగా పట్టణానికి చెందిన సాయాగౌడ్ రాయకూర్ నుంచి బోధన్‌కు వస్తుండగా రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సతీశ్‌గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకి చెందిన మంత్రి రూపేశ్ యాసిడ్ తాగడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాందేవ్‌వాడకు చెందిన రూపేశ్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా అతను మద్యానికి బానిస కావడంతో భార్య వదిలి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తితో ఆదివారం యాసిడ్ తాగాడు. గమనించిన తల్లి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

మూడు ఇసుక లారీల సీజ్



బాల్కొండ: మోర్తాడ్ మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను పట్టుకుని సీజ్ చేసినట్లు మోర్తాడ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించి పట్టుకున్నామని, సీజ్ చేసిన ఇసుకను మైనింగ్ శాఖకు అప్పగించినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ



కామారెడ్డి క్రైం: తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగిన ఘటన జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన నర్సయ్య తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి దొంగలు పడినట్లు గుర్తించారు. కొద్ది దూరంలో ఉండే రాజు అనే వ్యక్తి ఇంట్లో కూడా ఇదే విధంగా చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీం బృందాన్ని పిలిపించి ఆధారాలు సేకరించారు. ఆయా ఇండ్లలో తులంన్నర బంగారు ఆభరణాలు, 22 తులాల వెండి,రూ. 30 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. విచారణ చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గురురాఘవేంద్ర కాలనీలో..

కామారెడ్డి క్రైం: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని గురురాఘవేంద్ర కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై రాజు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన వేర్పుల మల్లేశం తన కుటుంబీకులతో కలిసి ఈనెల 23న బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం ఇంటికి తాళం వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బీరువాలో దాచి ఉంచిన తులంన్నర బంగారం, వెండి, నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని చిన్నాబజార్‌లో షార్ట్‌సర్క్యూట్‌లో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. చిన్నాబజార్‌లో ఉన్న దొండి స్వామి ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు ఇల్లు కాలిపోయింది. ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు చూసి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు.

సిర్పూర్‌లో గుడిసె ..



డొంకేశ్వర్: మండలంలోని సిర్పూర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మాడ వేడి సాయమ్మకు చెందిన నివాసపు గుడిసె దగ్ధమైంది. గుడిసెలో దేవుడి ఫొటో వద్ద దీపం వెలిగించగా ప్రమామదం చోటు చేసుకుంది. కాలిపోయిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.30వేల వరకు నగదు, చేపలు పట్టే వలలు, ఇతర సామాగ్రి కాలిపోయాయి. దీంతో చేపలు పట్టుకుంటూ జీవిస్తున్న కుటుంబం రోడ్డున పడింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

నస్రుల్లాబాద్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఏఎస్సై అబీద్ బేగ్ సోమవారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ యువతి రెండు రోజుల క్రితం కాలేజీకి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

కుక్కను ఢీకొని ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన దిలీప్ అనే వ్యక్తి సోమవారం సాయంత్రం బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా కామిశెట్టిపల్లి వద్ద కుక్కను ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSION
- Admission for guidence ఇంటర్, డిగ్రీ, పీజీ, B.Tech, LLB, B.Sc, అగ్రి, GNM, BHMS, BAMS, BNYS, BPT, D.ఫాం, B.ఫాం. 9494903629, 7660043034 కొన్ని సీట్లు మాత్రమే. [Z-1239947]

SERVICES

FINANCIAL SERVICES
- సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264033]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.